సాక్షి ఖమ్మం

శనివారం, 16, నవంబర్, 2024



.. ఎద్దుల బలప్రదర్శన పోటీలు

నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు శుక్రవారం ముగిశాయి. 10లో



అలరించిన బాలోత్సవ్

జాతీయ బాలోత్సవ్ పోటీలు మధిరలో శుక్రవారం ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల విద్యార్థులు హాజరయ్యారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, సాయంత్రం చలి తీవ్రత ఉంటుంది. మిగతా సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన



తల్లాడ : ధాన్యం తేమ శాతాన్ని పరీక్షిస్తున్న డీసీఓ గంగాధర్

తల్లాడ/కల్లూరు రూరల్: తల్లాడ మండలం నూతనకల్, వెంగన్నపేట, కల్లూరు మండలం చంద్రుపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార శాఖాధికారి(డీసీఓ) గంగాధర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. సన్నరకాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ కూడా చెల్లిస్తుందని తెలిపారు. అయితే, నిర్దేశిత తేమ శాతం వచ్చేలా ఆరబెట్టి తీసుకొస్తే మద్దతు ధర పొందొచ్చని చెప్పారు. వివిధ సొసైటీల సీఈఓలు కె.నాగబాబు, ఎస్.రాకేష్, దేవరపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

33.58 శాతం సర్వే పూర్తి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే శుక్రవారం నాటికి 33.58 శాతం పూర్తయింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 5,66,430 ఇళ్లకు గాను 4,129 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు. ఇప్పటి వరకు 1,90,224 ఇళ్లను సర్వే చేయగా 33.58 శాతంగా నమోదైందని అధికారులు వెల్లడించారు.

సాంస్కృతిక వారసత్వం పరిరక్షణకు కృషి



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన సాంస్కృతిక వారసత్వం, జాతీయ గౌరవాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించేలా కృషి చేస్తున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలను ఖమ్మంలోని గిరిజన భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక విజయలక్ష్మి మాట్లాడుతూ దేశ చరిత్రలో గిరిజన సమాజాల సహకారాన్ని స్మరించుకునేందుకు ప్రభుత్వం జన జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహిస్తోందని తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జన్మించిన బిర్సా ముండా నేతృత్వాన ఉల్గులాన్ ఉద్యమం నడిచిందని గుర్తుచేశారు. బ్రిటిష్ పాలకులపై తమ సమాజం ఎదుర్కొంటున్న దుస్థితిపై పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సహాయ అధికారులు జహీరుద్దీన్, సత్యవతి, ఏసీఎంఓ రాములు, వివిధ సంఘాల నాయకులు భూక్యా వీరభద్రం, బి.కిషన్‌నాయక్, మంగ్యా నాయక్, బి.శోభన్‌నాయక్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● కార్తీక కాంతులు !



ఖమ్మం గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కూసుమంచి మండలం జీళ్లచెరువు చెరువులో నిర్వహించిన తెప్పోత్సవంలో భక్తులు

- కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భక్తులు వెలిగించిన దీపాలతో శోభాయమానంగా ఆలయాలు



ఖమ్మం రాజరాజేశ్వరి ఆలయంలో జ్వాలాతోరణం మీదుగా స్వామిని తీసుకెళ్తున్న అర్చకులు

జిల్లావ్యాప్తంగా భక్తులు కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి, సుగ్గలవారి తోటలోని కాశీ విశ్వేశ్వర స్వామి తదితర ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భారీగా భక్తులు తరలిరావడంతో కిటకిటలాడాయి. ఆలయాల ఆవరణలో దీపాలు వెలిగించడమే కాక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే, సాయంత్రం జ్వాలాతోరణం, ఆకాశదీపం కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కూసుమంచి మండలం జీళ్లచెరువు చెరువులో తెప్పపై దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవం నిర్వహించగా వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. 11లో

అరగంట ముందే.. గేట్‌కు తాళం..

జిల్లాలో గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి సైతం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేయగా.. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. ఈనెల 17, 18వ తేదీల్లో జిల్లాలోని 87 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 27,984 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

– ఖమ్మంసహకారనగర్



- రేపటి నుంచి రెండు రోజులు గ్రూప్–3 పరీక్షలు
- జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- 27,984 మంది అభ్యర్థుల కోసం 87 కేంద్రాలు

గంటన్నర ముందు నుంచే అనుమతి

గ్రూప్–3 పరీక్షలకు 2022లో నోటిఫికేషన్ జారీ అయింది. ఈ పరీక్షలను 17, 18వ తేదీల్లో నిర్వహించనుండగా తొలిరోజు రెండు సెషన్లలో, రెండో రోజు ఒక సెషన్‌లో పరీక్ష జరుగుతుంది. మొదటి రోజు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5–30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇక 18వ తేదీన సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం పరీక్షకు 8–30 నుంచి 9–30గంటల వరకే అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 1–30నుంచి 2–30 గంటల వరకే అనుమతించి గేట్లకు తాళాలు వేస్తామని అధికారులు వెల్లడించారు. కాగా, ఎస్కార్ట్ లేకుండా ప్రశ్నాపత్రాలు వస్తే తీసుకోవద్దని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక ఎంపీడీఓలు రూట్ అధికారులుగా వ్యవహరిస్తారు.

కట్టుదిట్టంగా ఏర్పాట్లు

పరీక్షల సందర్భంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని దశల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల ప్రత్యేక భద్రత ఏర్పాటుచేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షకు ఒకరోజు ముందు కేంద్రాలను పరిశీలించి తాగునీటి కల్పించడమే కాక శానిటైజేషన్ చేయించాల్సి ఉంటుంది. ఇక చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగిలిన వారెవరి మొబైల్‌ఫోన్‌ను అనుమతించరు. అంతేకాక సిబ్బందితో పాటు అభ్యర్థులను క్షుణ్ణంగా పరీక్షించాకే లోపలకు పంపిస్తారు. కాగా, అబ్జర్వర్లు, రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు పలు దశల్లో ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

పరీక్ష పూర్తయ్యే వరకు లోపలే...

అభ్యర్థుల హాల్ టికెట్‌లో ఫొటో సరిగ్గా లేకపోతే మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపాల్ సంతకంతో తీసుకురావాలి. వీటిని పరీక్షా కేంద్రంలోని ఇన్విజిలేటర్‌కు అప్పగించాలి. బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయనున్న నేపథ్యాన మెహందీ, టాటూ వేసుకోవద్దని సూచించారు. కాగా, పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్లేందుకు అనుమతించబోమని అధికారులు వెల్లడించారు.

అభ్యర్థులకు సూచనలివే..

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఒకరోజు ముందే వెళ్లి చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ అభ్యర్థిని తనిఖీ చేయనుండా మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావొద్దని వెల్లడించారు. అలాగే, షూ కాకుండా చెప్పులు మాత్రమే ధరించి రావాలని, జ్యుయెలరీ కూడా ఉండొద్దని అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ అభ్యర్థి హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయనుండగా నిర్ణీత సమయానికి గంటన్నర ముందు నుంచే అనుమతించనున్నారు. అభ్యర్థులు తమ వెంట బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, ఫొటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డ్ తీసుకురావాల్సి ఉంటుంది.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ టోర్నీ ప్రారంభం

- ఖమ్మంలో అండర్–14 బాలబాలికల పోటీలు
- ఉమ్మడి పది జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్ తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్–14 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు ఖమ్మంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలను డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు పాత పది జిల్లాల నుంచి 320 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈసందర్భంగా డీఈఓ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కీడల్లోనూ రాణించాలని, తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా క్రీడాకారులు ఉండడం.. నేటి తరం కూడా క్రీడలపై ఆసక్తి చూపుతుండడం మంచి పరిణామమని తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ ఏటా ఖమ్మం జిల్లాలో అథ్లెటిక్స్ మీట్ నిర్వహిస్తుండగా మంచి స్పందన వస్తోందని చెప్పారు. జిల్లా పాఠశాలల క్రీడల సంఘం కార్యదర్శి కె.నర్సింహామూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు డి.ప్రసాద్, నున్నా రాధాకృష్ణ, మందుల వెంకటేశ్వర్లు, ఎండీ.షఫీక్ అహ్మద్, కోచ్ ఎండీ.గౌస్‌తో పాటు పి.రవిమారుత్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు వీరే..

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ టోర్నీలో తొలిరోజు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలుర 600 మీటర్ల పరుగు పందెంలో కె.జకేష్(ఆదిలాబాద్), కె.లోకేష్(వరంగల్), ఎం.చరణ్(వరంగల్), బాలికల విభాగంలో ఎం.రాజేశ్వరి(వరంగల్), ఎం.డీ.సమీరా(కరీంనగర్), టి.పల్లవి(రంగారెడ్డి), లాంగ్‌జంప్‌లో అన్విత(రంగారెడ్డి), శృతిహాసన్(ఖమ్మం), ధన్యశ్రీ(హైదరాబాద్), బాలుర షాట్‌పుట్‌లో జె.సాత్విక్(ఆదిలాబాద్), బి.నరేష్(ఖమ్మం), వంశీ(మహబూబ్‌నగర్) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

జాతీయ టోర్నీకి ఎంపికవుతాం! 10లో

ఆధునిక విధానాలతో మత్స్యకారులకు లాభాలు



సర్టిఫికెట్లు అందచేస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కూసుమంచి: మత్స్యకారులు చేపల పెంపకంలో సంప్రదాయ విధానాలకు తోడు ఆధునిక పద్ధతులు అవలంబిస్తే లాభాలు సాధించొచ్చని జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ అధికారి ఎం.శివప్రసాద్ తెలిపారు. కోరారు. పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధన కేంద్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన మత్స్యకారులకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా మత్స్యకారులకు సర్టిఫికెట్లు అందజేసిన శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపదను గణనీయంగా పెంచేందుకు అనువైన వాతావరణం, వనరులు ఉన్నాయని తెలిపారు. ఈమేరకు శిక్షణను సద్వినియోగం చేసుకుని వృత్తిలో మరింతగా రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా కేంద్రం పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు రవీందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి వ్యాపారులకు నోటీసులు



ఈనెల 12న మార్కెట్‌లో పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- జాబితాలో 18 మంది ఖరీదుదారులు, ఒక కమీషన్ ఏజెంట్
- ధర తగ్గిస్తుండడంపై ఇటీవల ఆగ్రహించిన కలెక్టర్
- నోటీసులు జారీ చేసిన యంత్రాంగం..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధర నిర్ణయించే క్రమాన వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తేలడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల మార్కెట్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తనిఖీ చేయగా తేమ శాతాన్ని పరీక్షించకుండా ధర నిర్ణయిస్తున్నారని గుర్తించారు. ఈ విషయమై వ్యాపారులతో పాటు అధికారులను సైతం మందలించారు. అయితే, కలెక్టర్ తనిఖీ చేసిన మరుసటి రోజు కూడా ఇదే పరిస్థితి ఎదురుకావడంతో రైతుల నుంచి ఆవేదన వ్యక్తమైంది. కాగా, ఖమ్మం మార్కెట్ పత్తి రైతులకు జరుగుతున్న నష్టం ఇంటిలిజెన్స్ నివేదిక ఆధారంగా సీఎంఓ నుంచి కూడా ఆరా తీశారు. దీంతో అధికారులు శుక్రవారం వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్ నుంచి 18 మంది ఖరీదుదారులతో పాటు ఒక కమీషన్ ఏజెంట్‌కు నోటీసు జారీ చేయగా.. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అయితే, కార్తీక పౌర్ణమి, వారాంతపు సెలవులు ఉండడంతో సోమవారం వరకు వేచి చూడాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

వ్యాపారుల తీరును తప్పుపట్టిన కలెక్టర్

వ్యవసాయ మార్కెట్‌కు రైతులు పత్తి తీసుకొస్తుండగా కమీషన్ వ్యాపారులు యంత్రాలతో కాకుండా చేతులతోనే పరీక్షించి తేమ ఎక్కువగా ఉందని ధర నిర్ణయిస్తున్నారు. దీంతో నాణ్యమైన పంట తీసుకొచ్చినా మద్దతు ధర అయిన రూ.7,521 ఎవరికీ దక్కడం లేదు. ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచి క్వింటా పత్తికి గరిష్టంగా రూ.6,800 ధర దాటలేదు. దీంతో రైతులు నష్టపోకుండా సీసీఐని రంగంలోకి దింపితే అక్కడ ఆంక్షల కారణంగా రైతులు మార్కెట్‌కే వస్తున్నారు. ఈనెల 12న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మార్కెట్‌లో తనిఖీ చేయగా ఓ రైతు తీసుకొచ్చిన పత్తిలో 9 శాతం తేమ ఉన్నా వ్యాపారి రూ.6,800గానే నిర్ణయించినట్లు గుర్తించారు. ఇదే పత్తికి నిబంధనల ప్రకారం రూ.7,445.79 ధర దక్కాలి. అలా జరగకపోవడంతో వ్యాపారులపై మండిపడిన కలెక్టర్ వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదేసమయాన అధికారులు, ఉద్యోగులు రైతుల పక్షాన ఉండకపోతే ఉద్యోగాలు ఊడుతాయని సైతం హెచ్చరించారు. ఈ నేపథ్యాన పలువురికి నోటీసులు జారీ చేయడంతో వారు ఇచ్చే సమాధానం ఆధారంగా ఏం చర్యలు తీసుకుంటారో తేలనుంది.

లక్ష్యం ముందు ఓడిన వైకల్యం

- గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికైన అంధురాలు మానస
- 4 కి.మీ. నడిచి వెళ్లివస్తూ ఇంటర్ వరకు పూర్తి
- ఆపై డిగ్రీ.. ఇప్పుడు ఉద్యోగానికి ఎంపిక



మద్దెబోయిన మానస

స్ఫూర్తి

కారేపల్లి: ఎవరూ తక్కువ చేసి చూడొద్దనే తపన.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ముందు ఆమెకు అంధత్వం అడ్డు రాలేదు. అడ్డంకులను అధిగమిస్తూ ఆత్మస్థైర్యంతో చదివి గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికైంది. లోకాన్ని చూడలేకపోయినా లక్ష్యాన్ని చేరిన మండలంలోని చీమలవారిగూడెంకు చెందిన అంధురాలు మద్దెబోయిన మానస యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

ఇప్పటికే బ్యాంక్‌లో ఉద్యోగం

కారేపల్లి మండలం చీమలవారిగూడెంకు చెందిన అంధ విద్యార్థిని మద్దెబోయిన మానస తాజాగా విడుదలైన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అకౌంటెంట్‌గా ఎంపికైంది. ఖమ్మంలోని ఐడీబీఐ బ్యాంకు(ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తూనే ఆమె గ్రూప్స్‌కు సిద్ధమైంది. రాష్ట్రప్రభుత్వం గ్రూప్–4 నోటిఫికేషన్ విడుదల చేయడంతో దరఖాస్తు చేసిన మానస సహాయకురాలి చేయూతతో పరీక్ష రాసింది. ఈక్రమాన పరీక్షలో ప్రతిభ కనబరిచి అంధుల కోటాలో జూనియర్ అకౌంటెంట్ ఉద్యోగానికి ఎంపికవడం విశేషం.

చిన్నతనం నుంచే చదువుపై మక్కువ

చీమలవారిగూడెంకు చెందిన రైతు మద్దెబోయిన వెంకటనర్సయ్య–కళావతి దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు మల్లేష్, కుమార్తె మానస ఇద్దరూ అంధత్వంతో జన్మించారు. అయినా పిల్లలను భారంగా భావించకుండా మూడెకరాల్లోనే వ్యవసాయం చేస్తూ, కూలి పనులకు వెళ్తూ చదివించారు. వీరిలో మల్లేష్ ఎంఏ, బీఈడీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు.ఇక మానస 5వ తరగతి వరకు స్వగ్రామమైన చీమలవారిగూడెంలోనే చదివింది. ఆతర్వాత 6వ తరగతి నుంచి 10వతరగతి వరకు కారేపల్లి హైస్కూల్‌లో, ఇంటర్ సీఈసీ కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివింది. అయితే, గ్రామం నుంచి కారేపల్లికి నాలుగు కి.మీ. మేర సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు కూడా నడిచేవి కావు. అయినా స్నేహితురాళ్ల సాయంతో కాలినడకన వెళ్లివచ్చేది. కొన్నాళ్లకు చీమలవారిగూడెం – కారేపల్లి మధ్య తారురోడ్డు నిర్మాణం జరగడంతో ఆటోలు నడవటం మొదలైంది. దీంతో ఆటోలో వెళ్తూ కారేపల్లి వికాస్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఆ తర్వాత ఇంటి వద్దే సొంతంగా సిద్ధమై 2022లో ఐడీబీఐ బ్యాంకులో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎంపికైన మానస తన ప్రయత్నాలు మానకుండా ఇప్పుడు గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికవడంతో పలువురు అభినందిస్తున్నారు.

క్లుప్తంగా

కేంద్ర కవి సమ్మేళనంలో జిల్లా కవయిత్రి


మాట్లాడుతున్న కవయిత్రి సునంద

ఖమ్మంగాంధీచౌక్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో కేంద్ర బాల సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఖమ్మంకు చెందిన కవయిత్రి వురిమళ్ల సునంద పాల్గొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన సునంద వురిమళ్ల ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు సమ్మేళనంలో ఆమె హిందీ, ఇంగ్లిష్, తెలుగు భాషల్లో కవితా గానం చేయగా అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, ఉపాధ్యక్షులు కుముద్‌శర్మ తదితరులు అభినందించారు.

డబుల్ బెడ్‌రూం ఇంట్లో కూలిన స్లాబ్ పెచ్చులు


స్లాబ్ పెచ్చులు కూలడంతో తేలిన చువ్వలు

బోనకల్: మండలంలోని రావినూతలలో డబుల్ బెడ్‌రూం ఇంటి స్లాబ్ పెచ్చులు కూలిపడ్డాయి. గ్రామానికి చెందిన రామకృష్ణకు గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇంటిని కేటాయించింది. కుటుంబీకులు శుక్రవారం తాళం వేసి కూలీ పనులకు వెళ్లగా స్లాబ్ పైపెచ్చులు కూలిపడ్డాయి. ఈ సమయాన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. కాగా, ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడం వల్లే ఇలా జరిగినందున తమకు న్యాయం చేయాలని రామకృష్ణ కోరారు.

పండుగ వేళ.. బతికిపోయింది!


బంధించే సమయాన పడగ విప్పిన పాము

రఘునాథపాలెం: మండలంలోని వీ.వీ.పాలెంలో కొత్త కలెక్టరేట్ వెనకాల నివాసముంటున్న సుబ్బారావు ఇంట్లోకి శుక్రవారం తాచుపాము ప్రవేశించింది. ఇంటి వరండాలోని బల్ల చాటున నక్కిన పామును గుర్తించారు. అయితే, స్థానికులు చేరుకుని కార్తీక పౌర్ణమి కావడంతో పాముకు హానీ తలపెట్టవద్దని సూచించారు. దీంతో పాములు పట్టడంలో నైపుణ్యం కలిగిన గోపిని పిలిపించగా ఆయన దాన్ని బంధించి అటవీ ప్రాంతంలో వదిలేందుకు తీసుకెళ్లాడు.

పార్కింగ్ వ్యవహారంలో రెవెన్యూ అధికారిపై ఫిర్యాదు


ఖమ్మంక్రైం: వాహన పార్కింగ్ వ్యవహారానికి సంబంధించి రెవెన్యూ శాఖ ఖమ్మం అర్బన్ ప్రధాన అధికారిపై శుక్రవారం రాత్రి ఓ అపార్ట్‌మెంట్ వాసులు ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఖమ్మం బైపాస్‌రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో సదరు అధికారి నివాసం ఉంటున్నారు. అయితే ఆయన వాహనానికి పార్కింగ్ స్థలం లేకపోవడంతో అపార్ట్‌మెంట్ కమిటీ వారు పక్కనే మరో స్థలాన్ని కేటాయించారు. అయినా వాహనాన్ని అక్కడ కాకుండా ఇష్టారీతిగా పార్కింగ్ చేస్తుండడంతో అపార్ట్‌మెంట్ వాసులతో వివాదం తలెత్తగా వారు ఖమ్మం టూటౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈమేరకు పోలీసులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులో రాలేదు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం


వెంకన్నబాబు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఏపీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వారావుపేట మండలానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన మర్లపాటి వెంకన్నబాబు(20) ఏడాది కిందట గుంటూరులో ఓ ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. గురువారం రాత్రి స్వగ్రామంలో జరిగిన అయ్యప్ప పడిపూజకు వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం తిరిగి ద్విచక్రవాహనంపై గుంటూరు వెళ్తున్న క్రమంలో విజయవాడ – గుంటూరు మధ్యలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి తల్లిదండ్రులతోపాటు, చెల్లి ఉంది. కాగా, యువకుడి మృతితో స్వగ్రామంలో విషాదం నెలకొంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,144

జాతీయ టోర్నీకి ఎంపికవుతాం!

- జిల్లా ఖ్యాతిని నిలబెడుతాం
- ఖమ్మంలో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, కరాటే పోటీలు
- సత్తా చాటుతామంటున్న జిల్లా క్రీడాకారులు, కోచ్‌లు


అథ్లెటిక్ టోర్నీకి హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి అండర్–14 అథ్లెటిక్స్ టోర్నీ ఖమ్మంలో శుక్రవారం మొదలైంది. అలాగే, అండర్–19 విభాగంలో కరాటే పోటీలు కూడా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని పాత పది జిల్లాల వారీగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరు కాగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పాల్గొంటున్న క్రీడాకారులు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న టోర్నీలో సత్తా చాటడం, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే జట్టులో స్థానం సాధించడం ఖాయమని చెబుతున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, కోచ్‌ల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

పోటీతత్వం పెంచేందుకే టోర్నీలు



క్రీడాకారుల్లో ప్రతిభ పెంపొందించేందుకు టోర్నీలు ఉపకరిస్తాయి. అంతేగాక క్రీడాకారుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుంది. పోటీలకు హాజరవడం ద్వారా వారి సామర్థ్యం తెలుస్తుంది. దీంతో కోచ్‌లు మెరుగైన శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడుతుంది.

– కె.నర్సింహామూర్తి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి


లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి

క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది..



జిల్లాలో టోర్నీలు విరివిగా నిర్వహించడం ద్వారా ఔత్సాహికులు క్రీడలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఇందులో మెరికలను గుర్తించి తగిన రీతిలో శిక్షణ ఇస్తే ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దొచ్చు. అలా వారు పతకాలు సాధిస్తే జిల్లా పేరు మార్మోగుతుంది.

– ఎం.డీ.మూసాకలీం, అండర్–19 క్రీడల కార్యదర్శి

టోర్నీ ఇక్కడ నిర్వహించేలా కృషి



ప్రతీసారి జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి పాఠశాలలకు సంబంధించి ఓ కేటగిరీలో టోర్నీ నిర్వహిస్తున్నాం. ఇక్కడ అథ్లెటిక్ అకాడమీ ఉన్నందున ఈసారి టోర్నీ నిర్వహణ బాధ్యతలు దక్కించుకున్నాం. రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా అథ్లెట్లకు గుర్తింపు ఉంది.

– ఎం.డీ.షఫీక్ అహ్మద్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి

జిల్లా కరాటే జట్టు బాగుంది..



రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటే అవకాశాలు ఉన్నాయి. ఎక్కువసంఖ్యలో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్టుకు ఎంపికవుతారని భావిస్తున్నాం. జిల్లా జట్టులో ఉత్తమ క్రీడాకారులు ఉండడమే ఈ నమ్మకానికి కారణం.

– గోపతి సైదులు, అండర్–19 కరాటే కోచ్

తొలిసారి రాష్ట్రస్థాయి పోటీలకు...



తొలిసారిగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కాగా.. స్వస్థలంలో పోటీలు జరుగుతుండడం ఆనందంగా ఉంది. కచ్చితంగా మొదటి మూడు స్థానాల్లో నిలుస్తాననే నమ్మకం ఉంది. ఇందుకోసం శ్రమిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలనేదే నా లక్ష్యం.

– ఎం.భవిత, అథ్లెట్, ఖమ్మం

పతకంపై నమ్మకం ఉంది..



మా అమ్మానాన్నలు రోజు గ్రౌండ్‌కు తీసుకొస్తారు. కోచ్ చెప్పిన విధంగానే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ప్రాక్టీస్ చేశా. రాష్ట్ర స్థాయి పోటీల్లో తప్పకుండా మెడల్ సాధిస్తాననే నమ్మకముంది. నాకు మెడల్స్ వస్తే అమ్మనాన్న, కోచ్ సంతోషిస్తారు.

– బి.రుతిక, అథ్లెట్, ఖమ్మం

ఏర్పాట్లు బాగున్నాయి..



ఇక్కడ టోర్నీ నిర్వహణ ఏర్పాట్లు బాగున్నాయి. ఇప్పటికే జాతీయ కరాటే పోటీల్లో పాల్గొన్నాను. కానీ అండర్–19 స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన నిర్వహించే పోటీలకు పాల్గొనడం మొదటిసారి. ఇందులో సత్తా చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యేందుకు ప్రయత్నిస్తా.

– సీహెచ్.అభినయశ్రీ, కరాటే క్రీడాకారిణి, ఖమ్మం

మరోసారి జాతీయ పోటీలకు ఎంపికవుతా..



గత ఏడాది అండర్–19 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు హాజరయ్యా. ఈసారి కూడా ఎంపికయ్యేందుకు శిక్షణ పొందాను. ఈసారి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం దక్కించుకోవాలనేది నా లక్ష్యం. మా నాన్న ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరగలిగాను.

– జి.గణేష్, కరాటే క్రీడాకారుడు, ఖమ్మం

సమాజ మార్పులో ఉపాధ్యాయులే కీలకం

టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: సమాజ మార్పులో ఉపాధ్యాయులే కీలకమని గుర్తించి అందుకోసం కృషి చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి సూచించారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన జిల్లా కౌన్సిల్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా సమాజంలో అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. ఈమేరకు సమానమైన అవకాశాలు, నూతన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగం కావాలని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటనతో పాటు ఇతర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఏ.నాగేశ్వరరావుతో పాటు నాయకులు మనోహర్‌రాజు, ఎస్.విజయ్, వెంగళరావు, యాకూబ్‌పాషా, సంధ్యారాణి, ఎం.నాగిరెడ్డి, ముత్తయ్య, వై.పద్మ, వీరబాబు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజా ఉత్సవాల పేరిట రాష్ట్రప్రభుత్వం సంబరాలు నిర్వహించడం సరికాదని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.రామకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. హామీలు అమలుచేయాలనే డిమాండ్‌తో ఈనెల 25 నుండి 30వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట, డిసెంబర్ 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రేపాకుల శివలింగం, బందెల వెంకయ్య, తిమ్మిడి హన్మంతరావు, కంకణాల అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

తిరుమలాయపాలెం: మద్యానికి బానిసైన వ్యక్తిని భార్య మందలించడంతో ఆయన గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఏలువారిగూడెంకు చెందిన పోలెపాంగు లక్ష్మణ్(49) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో భార్య మందలించింది. దీంతో గురువారం రాత్రి గడ్డి మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అలరించిన జాతీయస్థాయి బాలోత్సవ్


జానపద గేయానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మధిర: రామభక్త సీతయ్య కళాపరిషత్ ఆధ్వర్యాన మధిరలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మండపంలో 27వ జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ పోటీలను మధిర రంగస్థలం కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, ఎంఈఓ వై.ప్రభాకర్ ప్రారంభించారు. తొలిరోజు శాస్త్రీయ, జానపద నృత్యాలతోపాటు బృంద నృత్యాల పోటీలు నిర్వహించగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. రామభక్త సీతయ్య కళాపరిషత్ అధ్యక్షుడు బాబ్లా మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను పరిరక్షించేందుకు కళాకారులకు పుట్టినిల్లయిన మధిరలో పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కళల ద్వారా ప్రజలను చైతన్యపరిచి సమాజంలో రుగ్మతలను నిర్మూలించవచ్చునని చెప్పారు. కాగా, వివిధ ప్రాంతాల విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి


కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న విజయనగరం - శ్రీకాకుళం క్రీడాకారులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో ఈనెల 12న మొదలైన ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు శుక్రవారం ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒంగోలు ఎద్దులతో యజమానులు హాజరుకాగా చివరిరోజు న్యూ కేటగిరీ విభాగంలో పోటీలు నిర్వహించారు. ఏపీలోని బాపట్లకు కెందిన శివరామకృష్ణ – శిరీష, హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు, ఏపీలోని పెనుగ్రంచిప్రోలుకు చెందిన దేవభక్తిని సుబ్బారావు, పల్నాడుకు చెందిన యర్రా ఏసుబాబు, గన్నవరానికి చెందిన కొలుసు శ్రీనివాసరావు, కృష్ణా జిల్లాకు చెందిన ఆర్.వీ.ఎస్.బ్రదర్స్, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సహస్ర యాదవ్, మఠంపల్లికి చెందిన నర్సయ్య తీసుకొచ్చిన జతలు వరుసగా ఎనిమిది స్థానాల్లో నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేయడంతో నిర్వాహకులు దయాకర్‌రెడ్డి, దండా ప్రవీణ్‌ను పలువురు సన్మానించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, నాయకులు టి.దయాకర్‌రెడ్డి, శాఖమూరి రమేష్, దండా ప్రవీణ్, యర్రబోయిన నర్సయ్య, చిట్యాల రమేష్, తన్నీరు కృష్ణమూర్తి, బచ్చలకూరి నాగరాజు, కడియాల నరేష్, దండా సత్యనారాయణ, ఇస్లావత్ బాలాజీ, దండా వెంకటేశ్వర్లు, ఆర్.నవీన్, కె.ఉపేందర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత.. విజయనగరం జట్టు

కార్తీకపౌర్ణమి సందర్భంగా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలో నిర్వహిస్తున్న మహిళల కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి జట్లు హాజరుకాగా, చివరిరోజు విజయనగరం – శ్రీకాకుళం మధ్య ఫైనల్స్ హోరాహోరీగా సాగింది. చివరకు విజయనగరం జట్టు విజేతగా నిలవగా, శ్రీకాకుళం జట్టుకు రెండో స్థానం దక్కింది. అలాగే, చిత్తూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి, విశాఖపట్నం, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జట్లు 3నుంచి 8వ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి ట్రోఫీలు అందజేయగా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

వాగ్వాదానికి దిగాడనే కోపంతోనే...

లారీతో ఢీకొట్టి వ్యక్తి మృతికి కారకులైన ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధు, పక్కన ఎస్సై లక్ష్మీభార్గవి

మధిర: బైక్‌ను ఓవర్ టేక్ చేసే క్రమాన లారీ తనకు తాకిందని వాగ్వాదానికి దిగిన వ్యక్తి పలుమార్లు వాహనాన్ని ఆపడం.. ఆపై లారీకి అడ్డుగా నిలబడ్డాడనే కోపంతో ఢీకొట్టగా మృత్యువాత పడ్డాడు. ఈనెల 12న రాత్రి జరిగిన ఈ ఘటనకు కారకులైన లారీ డ్రైవర్, క్లీనర్‌ను అరెస్ట్ చేసినట్లు మధిర సీఐ డి.మధు వెల్లడించారు. ఈమేరకు మధిర సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ముత్యాలంపాడుకు చెందిన లారీ డ్రైవర్ రామిశెట్టి దుర్గారావు, నందిగామకు చెందిన క్లీనర్ పింగలి మల్లారెడ్డి ఈనెల 11న నాగపూర్ నుంచి కందిపప్పు లోడ్‌తో బయలుదేరారు. మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, ఖమ్మం మీదుగా ఈనెల 12న రాత్రి 7గంటల సమయాన వైరా చేరుకున్నారు. అక్కడ నుంచి మధిర మీదుగా కంచికచర్ల నుంచి విజయవాడ వెళ్లాల్సి ఉంది. అయితే, వైరా దాటాక లారీ ముందు బైక్‌పై వెళ్తున్న కొలికపోగు సోమయ్య(40)ను ఓవర్ టేక్ చేశారు. ఈక్రమాన లారీ తన బైక్‌కు తాకిందని, తనను ఢీకొట్టేందుకు అలా చేశారని భావించిన సోమయ్య లారీని వెంబడిస్తూ పాలడుగు క్రాస్ వద్ద అడ్డుకున్నారు. దీంతో లారీ డ్రైవర్ – సోమయ్య నడుమ వాగ్వాదం జరిగింది. ఆపై డ్రైవర్ మధిర వైపు వస్తుండగా మళ్లీ సోమయ్య వెంబడిస్తూ కృష్ణాపురం వద్ద ఆపాడు. అక్కడ డ్రైవర్, క్లీనర్‌తో వాగ్వాదానికి దిగడమే కాక లారీకి అడ్డుగా నిలబడ్డాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో లారీతో ఆయనను ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో నిధానపురం క్రాస్ వద్ద లారీని ఆపేసి డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. ఈ ఘటనపై ప్రత్యక్ష సాక్షుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో మధిర రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆయన భార్యకు తీవ్ర గాయాలు


వెలిశాల రాజా (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సత్తుపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం రేజర్లకు చెందిన వెలిశాల రాజా(30) తన భార్య కావ్యతో కలిసి సత్తుపల్లి నుంచి రేజర్ల వెళ్తుండగా ఎన్టీఆర్ నగర్ మలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. విజయవాడలో చికిత్స పొందుతున్న రాజా శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. ఆయన గంగారంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు.

పట్టు పట్టారు.. కొలువు కొట్టారు

గ్రూప్–4 ఉద్యోగాలు సాధించిన పలువురు

- ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తూనే సాధన
- సర్కార్ కొలువులకు ఎంపికవడంతో అభినందనల వెల్లువ

జిల్లాలోని పలువురు యువతీ, యువకులు గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో సత్తా చాటి ఉద్యోగాలు సాధించారు. ఇందులో కొందరు ఇప్పటికే ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఉన్నారు. అయితే, ప్రయత్నం మానకుండా.. సాధన వీడకుండా ముందుకు సాగిన వారు గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపిక కావడంతో కుటుంబీకులు, స్థానికుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ముదిగొండ మండలం నుంచి...


బెందు వీరబాబు


సట్టు సుదర్శన్

ముదిగొండ: ముదిగొండ మండలంలోని బాణాపురం, వల్లభి, గంధసిరికి చెందిన యువకులు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తూనే గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బాణాపురానికి చెందిన బెందు వీరబాబు ఆర్మీ నుంచి 2022లో రిటైర్డ్ అయ్యాక సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఇప్పుడు గ్రూపు–4 ఉద్యోగం సాధించగా త్వరలో జరగనున్న గ్రూప్–3 ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇక వల్లభికి చెందిన బిచ్చాల రాము, గంధసిరికి చెందిన పాదిల అక్షయ్ సివిల్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగం చేస్తూనే గ్రూపు–4 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బాణాపురానికే చెందిన సట్టు సుదర్శన్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే పట్టు వదలకుండా సిద్ధమై గ్రూపు–4 ఉద్యోగం సాధించడం విశేషం.

తండ్రి కల నెరవేర్చిన అర్షాద్


షేక్ అర్షాద్


కటికి ఉపేందర్‌రావు

తల్లాడ: తల్లాడ మండలం మల్లవరానికి చెందిన షేక్ అర్షాద్ గ్రూప్–4 ఉద్యోగం సాధించాడు. ఆయన తండ్రి ఫకీర్ అహ్మద్ జైలర్‌గా పనిచేస్తూ ఏడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి కోరిక మేరకు అర్షాద్ ప్రభుత్వ కొలువు సాధించి భద్రాద్రి జిల్లాలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. అయితే, ఫకీర్ అహ్మద్ తన కుమారులు ముగ్గురిని ప్రభుత్వ ఉద్యోగాల్లో చూడాలని తపించేవాడు. ఆయన అనుకున్నట్లుగానే పెద్ద కుమారుడు ఇర్షాద్ కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా, కుమారుడు షేక్ ఖాలీద్ డీసీసీబీ బ్యాంక్ స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు రెండో కుమారుడు అర్షాద్ గ్రూప్–4 ఉద్యోగం సాధించడంతో తండ్రి కలను నెరవేర్చినట్లయింది. ఇక మల్లవరానికే చెందిన కటికి ఉపేందర్‌రావు ఇప్పటికే ఆబ్కారీ కానిస్టేబుల్‌గా ఎంపికై శిక్షణ పొందుతుండగా.. తాజాగా గ్రూప్–4 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వ్యవసాయం కుటుంబానికి చెందిన ఉపేందర్‌రావు రెండు ఉద్యోగాలు సాధించడంపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఇది రెండో ఉద్యోగం..


షేక్ అజీజ్ అహ్మద్

వైరా: వైరాలోని బ్రాహ్మణపల్లికి చెందిన షేక్ అజీజ్ అహ్మద్ గ్రూప్–4 ఫలితాల్లో కనబర్చి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆయన ఇప్పటికే కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. అజీజ్ తండ్రి షేక్ బాబు జానీ వైరా ఏసీపీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల కానిస్టేబుల్‌గా ఎంపికవడంతో ఇప్పుడు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైన అజీజ్‌ను ఏసీపీ ఎం.ఏ.రహమాన్ తదితరులు అభినందించారు.

దినసరి కూలీ కుటుంబం నుంచి..


షేక్ నాగుల్ మీరా

వైరారూరల్: వైరా మండలం కేజీ సిరిపురానికి చెందిన షేక్ నాగుల్ మీరా గ్రూప్–4 ఫలితాల్లో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ఆయన తల్లిదండ్రులు దినసరి కూలీలు. అయినా నాగుల్‌మీరా కష్టపడి ఇంజనీరింగ్ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగా ఉద్యోగానికి ఎంపికైన నాగుల్ మీరాను కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.